## రుద్రూర్ ఆహార శాస్త్ర సాంకేతిక కళాశాల విద్యార్థినికి గోల్డ్ మెడల్స్



గోల్డ్ మెడల్‌ను అందుకుంటున్న శ్రీహర్ష

రుద్రూర్, జూన్ 12 : రుద్రూర్ మండలకేంద్రంలోని ఆహారశాస్త్ర సాంకేతిక కళాశాలకు చెందిన విద్యార్థిని శ్రీ హర్ష రెండు గోల్డ్‌మెడళ్లను సాధించినట్లు కళాశాల అసోసియేట్ డాక్టర్ కల్పన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. యూనివర్సిటీలో రిధిలో ఉత్తమ మార్కులు సాధించినందుకు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ అగ్రికల్చర్ యూనివర్సిటీలో ఇటీవల నిర్వహించిన కన్వెన్షన్ కార్యక్రమంలో గోల్‌మెడల్‌ను అందజేశారు. మరో గోల్డ్‌మెడల్‌ను అగ్రిటెక్ వారు అందజేశారు. శ్రీహర్షను రుద్రూర్ కళాశాలకు చెందిన బోధన, బోధనేతర సిబ్బంది శ్రీహర్షను అభినందించారు.

## నిజామాబాద్ జీజీహెచ్‌లో వ్యక్తి మృతి

వినాయక్‌నగర్, జూన్ 12 : నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ దవాఖాన ఆవరణలో ఉన్న రేకులషెడ్డులో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందినట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు. మృతుడి వయస్సు 30 నుంచి 40 ఏండ్ల మధ్య ఉంటుందని, ఎడమ చేతిపై నాని అని పచ్చబొట్టుతో రాసి ఉందని తెలిపారు. మృతుడి సంబంధీకులు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని లేదా 8712659837, 08462 220150 నంబర్లకు ఫోన్ చేయాలని ఎస్‌హెచ్‌వో సూచించారు.

## వృద్ధురాలి దారుణ హత్య



సాయవ్వ (ఫైల్)

బాన్సువాడ టౌన్, జూన్ 12 : ఒంటరిగా ఉంటున్న వృద్ధురాలి ఇంట్లోకి చొరబడిన దుండగులు ఆమె గొంతుకోసి దారుణంగా హతమార్చారు. కామారెడ్డి జిల్లా బాన్సువాడ మున్సిపల్ పరిధిలోని తాడ్కోల్ డబుల్ బెడ్రూం కాలనీలో బుధవారం ఈ ఘటన చోటు చేసుకున్నది. డీఎస్పీ, సీఐ కృష్ణ తెలిపిన వివరాల మేరకు.. బాన్సువాడలోని కోట గల్లీకి చెందిన ఉప్పరి సాయవ్వ (70)కు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు కోటగల్లీలోని పాత ఇంట్లో ఉంటుండగా, సాయవ్వ తన చిన్న కుమారుడితో కలిసి కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన డబుల్ బెడ్రూం ఇంట్లో నివాసముంటున్నారు. ఉపాధి కోసం కుమారుడు హైదరాబాద్‌కు వెళ్లగా, సాయవ్వ ఒక్కరే ఉంటున్నారు. బుధవారం గుర్తు తెలియని దుండగులు ఇంట్లోకి చొరబడి గొంతు కోసి ఆమెను దారుణంగా హతమార్చారు. అనంతరం ఆమె ఒంటిపై ఉన్న బంగారు, వెండి ఆభరణాలతో పరారయ్యారు. సమాచారమందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

## బస్సును ఢీకొన్న మొరం టిప్పర్

■ ప్రయాణికులకు తప్పిన ప్రమాదం ■ డ్రైవర్‌కు తీవ్రగాయాలు

డిచ్‌పల్లి, జూన్ 12 : ఆర్టీసీ బస్సును రాంగ్ రూట్‌లో వచ్చిన మొరం టిప్పర్ ఢీకొట్టడంతో బస్సు డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో ప్రయాణికులకు ప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. డిచ్‌పల్లి మండలంలోని బర్ధిపూర్ బైపాస్ రోడ్డు మీదుగా నిజామాబాద్ వెళ్తున్న కామారెడ్డి డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సును బుధవారం రాంగ్ రూట్‌లో అతివేగంతో వచ్చిన మొరం టిప్పర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో కామారెడ్డి డిపో బస్సు కుడివైపు ముందుభాగం పూర్తిగా ధ్వంసమైంది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో ప్రయాణికులకు తృటిలో ప్రమాదం తప్పింది. డ్రైవర్ తీవ్రగాయాల పాలై, స్పృహ తప్పడంతో చికిత్స కోసం జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించారు. టిప్పర్ డ్రైవర్ పరారీలో ఉన్నట్లు తెలిపారు.

# అలా వచ్చారు..ఇలా వెళ్లారు !



టీచర్ల కోసం వేచి చూస్తున్న విద్యార్థులు, సిబ్బంది



రామారెడ్డి కస్తూర్బా పాఠశాలలో అడ్మిషన్లు తీసుకుంటున్న స్వీపర్

- ■ మొదటి రోజే మధ్యాహ్నం వెళ్లిపోయిన ఉపాధ్యాయులు
- ■ దరఖాస్తులు తీసుకున్న స్వీపర్
- ■ రామారెడ్డిలోని కస్తూర్బా లో టీచర్ల తీరిది..

రామారెడ్డి, జూన్ 12: పాఠశాలల పునః ప్రారంభం రోజు ఉపాధ్యాయులు ఇలా వచ్చి.. అలా వెళ్లారు. పాఠశాలలో కొత్తగా విద్యార్థులను చేర్చుకోవడం కోసం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉండాల్సిన టీచర్లు మధ్యాహ్నం నుంచి వెళ్లిపోయారు. ఈ ఘటన కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలకేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో బుధవారం చోటుచేసుకున్నది. వివరాలు ఇలా ఉన్నాయి.

రామారెడ్డిలోని కస్తూర్బా పాఠశాలలో 11మంది బోధన సిబ్బంది ఉన్నారు. వారు ఉదయం పాఠశాలకు వచ్చారు. మధ్యాహ్నం వరకు ఉండి పాఠశాల బాధ్యతలను స్వీపర్ కళావతి, వంట మనిషి యాదమ్మకు అప్పగించి వెళ్లిపోయారు. పాఠశాల తొలిరోజు కావడంతో పలు గ్రామాల నుంచి విద్యార్థులు తమ తల్లిదండ్రులతో వచ్చారు. ఉపాధ్యాయులు లేకపోవడంతో అక్కడే కొద్దిసేపు వేచి చూశారు. మరికొందరు వెనుదిరిగి వెళ్లారు. అడ్మిషన్ల కోసం వచ్చిన వారు స్వీపర్‌కు సర్టిఫికెట్లను అందజేయగా.. ఆమె తీసుకోవడం గమనార్హం.

ఈ విషయమై పాఠశాల ఎస్‌వో వనితను వివరణ కోరగా.. తమ పాఠశాలలో సీట్లు ఖాళీ లేవని తెలిపారు. స్వీపర్ సర్టిఫికెట్లు ఎందుకు తీసుకున్నారో తెలియదన్నారు. ఇద్దరు టీచర్లు కన్నాపూర్ తండాకు క్యాన్వసింగ్‌కు వెళ్లారని, మరో ఇద్దరు పుస్తకాలు తీసుకునేందుకు ఎమ్మార్సీకి వెళ్లారని తెలిపారు. తమ పాఠశాల రెసిడెన్షియల్ అని.. తమకు చాలా పనులు ఉంటాయని చెప్పడం గమనార్హం.

## 'మిషన్ భగీరథ' సర్వేను వేగవంతం చేయాలి

■ కామారెడ్డి అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి



సర్వే వివరాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

దోమకొండ, జూన్ 12 : గ్రామాల్లో ఉన్న మిషన్ భగీరథ కుళాయిల కలెక్షన్ సర్వేను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అధికారులకు సూచించారు. దోమకొండలోని కుళాయిల సర్వేను బుధవారం పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. ఇప్పటి వరకు ఇచ్చిన లక్ష్యాన్ని గడువులోగా పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మహిళా స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో విద్యార్థులకు కుట్టిస్తున్న ఏకరూప దుస్తులను వెంటనే పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డీఎల్పీవో శ్రీనివాస్, ఎంపీవో తిరుపతిరెడ్డి, ఏపీఎం రాజు, ఏపీవో రజినీ, పంచాయతీ కార్యదర్శి సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

## ఆవును చంపిన ఇద్దరికి 50 రోజుల కఠిన కారాగార శిక్ష

రుద్రూర్, జూన్ 12 : రుద్రూర్ మండలకేంద్రంలో ఏడు సంవత్సరాల క్రితం గోవును చంపిన ఇద్దరు వ్యక్తులకు కోర్టు బుధవారం 50 రోజుల కఠిన కారాగార శిక్షతోపాటు వెయ్యి రూపాయల జరిమానా విధించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 2017లో రుద్రూర్‌కు చెందిన గైని కృష్ణ, ఎండీ హైమద్ ఖురేషీ గోవును చంపి పారిపోతుండగా పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు. వారిని పోలీసులు బుధవారం బోధన్ కోర్టులో ప్రవేశపెట్టగా.. నిందితులకు అడిషనల్ జేఎఫ్‌సీఎం, మెజిస్ట్రేట్ సాయిశివ 50 రోజుల కఠిన కారాగార శిక్షతోపాటు ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

## బాలుడి మృతికి కారకుడైన డ్రైవర్‌కు జైలుశిక్ష

శక్కర్‌నగర్, జూన్ 12: టిప్పర్‌ను అతివేగంగా నడిపి నాలుగేండ్ల బాలుడి మృతికి కారణమైన డ్రైవర్‌కు ఆరు నెలల సాధారణ జైలుశిక్ష విధిస్తూ బోధన్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి సాయి శివ బుధవారం తీర్పు చెప్పారు. సంఘటనకు సంబంధించి ఎడపల్లి ఎస్సై వంశీకృష్ణా రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎడపల్లి మండలంలోని ఎంఎస్‌సీ ఫారం వద్ద 2 జూన్, 2017న ఎండీ. అయాన్ అనే నాలుగేండ్ల బాలుడు తన ఇంటినుంచి మేనత్త ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో రోడ్డు పక్కన ఉన్న బాలుడిని నిజామాబాద్ నుంచి బోధన్ వైపు వెళ్తున్న ఏపీ 25వీ 7905 నంబరు గల టిప్పర్ అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అయాన్ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తండ్రి ఇబ్రహీం ఎడపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. లారీ డ్రైవర్ గొల్లగుట్ట తండాకు చెందిన భూక్యా శ్రీనుగా గుర్తించి, అప్పటి ఎస్సై ఎండీ ఆసిఫ్ కేసు నమోదు చేసి, సాక్ష్యాధారాలను కోర్టుకు సమర్పించారు. బాధితుల తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ చిదిరాల రాణి వాదించారు. నేరం రుజువైనందున భూక్యా శ్రీనుకు ఆరునెలల సాధారణ జైలు శిక్ష విధిస్తూ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి సాయిశివ తీర్పు చెప్పారు. ఈ కేసులో లైజన్ అధికారిగా శంకర్, సీడీవోగా ఎన్. సాయన్న విధులు నిర్వహించారు.

## లింగపేటలో జాతీయ బృందం పర్యటన

■ అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ



పోల్కంపేట గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్లు, సిబ్బందితో మాట్లాడుతున్న జాతీయ బృందం సభ్యులు

లింగంపేట, జూన్ 12: కామారెడ్డి జిల్లా లింగంపేట మండలం పోల్కంపేట, లింగంపేట గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను జాతీయ బృందం సభ్యులు బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జాతీయ కుటుంబ సర్వే అధికారులు అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు అందిస్తున్న పోషకాహారంపై చిన్నారుల తల్లులను అడిగి తెలుసుకున్నారు. పోషకాహార లోపం ఉన్న విద్యార్థులకు ప్రత్యేకంగా పౌష్టికాహారం అందిస్తున్నట్లు వెల్లడించారు. పోషకాహార లోపం ఉన్న పలువురు విద్యార్థుల ఎత్తు, బరువును పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసిన వారిలో కేంద్ర బృందం సభ్యులు డాక్టర్ అల్కా మథుర్, రీషా దేశాయ్, గీతిక గ్రోవర్, జిల్లా అధికారులు విజయ్, బాలాజీ, ప్రసాద్, ఎల్లారెడ్డి సీడీపీవో సరిత, సూపర్‌వైజర్లు స్వరూప, లత, అంగన్‌వాడి టీచర్లు ఉన్నారు.

## భిక్కనూరులో అస్సాం బృందం..

■ మహిళా మండల సమాఖ్య పరిశీలన



అస్సాం రాష్ట్ర అధికార బృందం సభ్యులతో మహిళా సమాఖ్య సభ్యులు, అధికారులు

భిక్కనూరు, జూన్ 12 : మండలంలోని మహిళా మండల సమాఖ్య, గ్రామ సంఘాల పనితీరును అస్సాం రాష్ట్రం నుంచి వచ్చిన అధికార బృందం బుధవారం పరిశీలించింది. మండల సమాఖ్యను ఎలా బలోపేతం చేశారని, లాభాలు ఎలా వస్తున్నాయనే విషయాలను తెలుసుకునేందుకు అస్సాం బృందం సభ్యులు వచ్చారని ఏపీఎం శ్రీనివాస్ తెలిపారు. బ్యాంకు లింకేజీ రుణాలను ఎలా తీసుకుంటున్నారు, తీసుకున్న రుణాలను జీవనోపాధి కోసం ఏ విధంగా వినియోగిస్తున్నారు, లాభాలను గడించడం తదితర అంశాలపై వివరాలను సేకరించారని చెప్పారు. బృందం వెంట ఐబీ డీపీఎం సుధాకర్, డీఎంజీ రాము, అధ్యక్షురాలు రాజమణి, కార్యదర్శి విజయ, కోశాధికారి గంగలక్ష్మి, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## హైదరాబాద్-అయోధ్య మధ్య ఫ్లైట్ రద్దు

డిమాండ్ లేకపోవడంతో నిలిపివేసిన స్పైస్‌జెట్



ముంబై, జూన్ 12: హైదరాబాద్ నుంచి అయోధ్యకు నేరుగా నడిపే విమాన సర్వీసులను నిలిపివేస్తున్నట్టు చౌక విమానయాన సంస్థ స్పైస్‌జెట్ ప్రకటించింది. రెండు నెలల క్రితం ప్రారంభించిన ఈ విమాన సర్వీసుకు డిమాండ్ లేమి కారణంగా రద్దు చేస్తున్నట్లు తెలిపింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో హైదరాబాద్-అయోధ్యల మధ్య వారానికి మూడు సార్లు నడిపే సర్వీసును ప్రారంభించింది. డిమాండ్-సప్లై ఆధారంగా విమాన సర్వీసులను నడుపుతున్నట్లు, ఈ సర్వీసును రద్దు చేసినప్పటికీ చెన్నై-అయోధ్యల మధ్య విమాన సర్వీసును యథాతథంగా నడుపుతున్నట్లు కంపెనీ ప్రతినిధి ఒకరు తెలిపారు. అలాగే జనవరి 21 నుంచి ఢిల్లీ నుంచి అయోధ్యకు సంస్థ విమానాన్ని నడుపుతున్నది.

# జీవిత బీమాపై రుణాలివ్వాల్సిందే

ఇన్సూరెన్స్ సంస్థలతో ఐఆర్డీఏఐ

న్యూఢిల్లీ, జూన్ 12: అన్ని జీవిత బీమా సేవింగ్స్ ప్లాన్లలో పాలసీ లోన్ సదుపాయం అనేది ఇకపై తప్పనిసరి అని బీమా రంగ రెగ్యులేటర్ ఐఆర్డీఏఐ బుధవారం ఇన్సూరెన్స్ కంపెనీలకు స్పష్టం చేసింది. జీవిత బీమా తీసుకున్న పాలసీదారులకు నిబంధనలకు లోబడి వారి పిల్లల ఉన్నత చదువులు, పెండ్లిళ్లు, గృహ నిర్మాణం లేదా కొనుగోలు, వైద్య చికిత్స తదితర నగదు అవసరాలను బట్టి రుణాలు ఇవ్వాల్సిందేనని సదరు సంస్థలకు చెప్తూ ఓ మాస్టర్ సర్క్యులర్‌ను విడుదల చేసింది. జీవిత బీమా పాలసీలకు సంబంధించి ఉన్న అన్ని రెగ్యులేషన్లను ఏకం చేస్తూ దీన్నిచ్చింది. ఇక పాలసీదారులు తమ పాలసీ నిబంధనలు, షరతులను సమీక్షించేందుకున్న సమయాన్ని (ఫ్రీ లుక్ పీరియడ్) 15 రోజుల నుంచి 30 రోజులకు ఐఆర్డీఏఐ పెంచింది. ఇప్పటికే జనరల్ ఇన్సూరెన్స్ పాలసీల కోసం కూడా ఐఆర్డీఏఐ ఇదే తరహా మాస్టర్ సర్క్యులర్‌ను విడుదల చేసిన సంగతి విదితమే. కాగా, పాలసీలను సరెండర్ చేస్తే పాలసీదారులకు ప్రయోజనకరంగా బీమా సంస్థల నిర్ణయాలుండాలని ఐఆర్డీఏఐ తెలిపింది.

## హెల్మెట్లపై జీఎస్టీ ఎత్తేయండి

కౌన్సిల్‌ను కోరిన ఐఆర్ఎఫ్



న్యూఢిల్లీ, జూన్ 12: హెల్మెట్లపై వస్తు, సేవల పన్ను (జీఎస్టీ)ను ఎత్తివేయాలని బుధవారం జీఎస్టీ కౌన్సిల్, కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖలను అంతర్జాతీయ రోడ్డు సమాఖ్య (ఐఆర్ఎఫ్) కోరింది. ప్రస్తుతం హెల్మెట్లపై 18 శాతం జీఎస్టీ పడుతున్నది. దీంతో దీన్ని సున్నా (నిల్ లేదా జీరో)కు చేర్చాలని ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేసింది. హెల్మెట్ల వాడకాన్ని పెంచేందుకు ఈ నిర్ణయం దోహదం చేయగలదన్న ఆశాభావాన్ని వ్యక్తం చేసింది. రోడ్డు ప్రమాదాల్లో తలకు గాయాలై ద్విచక్ర వాహనదారులే ఎక్కువగా ప్రాణాలు కోల్పోతున్నారన్న ఐఆర్ఎఫ్.. హెల్మెట్లపై జీఎస్టీని తొలగిస్తే వాటి అమ్మకాలు పెరిగి, తద్వారా టూవీలర్ వినియోగదారుల భద్రత కూడా పెరుగుతుందన్నది. ఈ క్రమంలోనే ప్రపంచవ్యాప్తంగా చోటుచేసుకుంటున్న రోడ్డు ప్రమాద మరణాల్లో దాదాపు 12 శాతం భారత్‌లోనే సంభవిస్తున్నాయని, ఇది దేశ ఆర్థిక వ్యవస్థను 15.71-38.81 బిలియన్ డాలర్ల మేర నష్టపరుస్తున్నట్టు బాష్ నివేదిక పేర్కొన్నదని ఐఆర్ఎఫ్ గుర్తుచేసింది.

వాణిజ్య



## అత్యంత విలువైన సంస్థగా యాపిల్

న్యూయార్క్, జూన్ 12: ప్రపంచంలో అత్యంత విలువైన సంస్థగా మళ్లీ యాపిల్ అవతరించింది. ఇప్పటి వరకు తొలి స్థానంలో కదలాడిన మైక్రోసాఫ్ట్‌ను అధిగమించి యాపిల్ తిరిగి తొలి స్థానాన్ని దక్కించుకున్నది. అంతర్జాతీయంగా ఐఫోన్ల అమ్మకాలు భారీగా పుంజుకోవడంతో కంపెనీ షేరు ధర రికార్డు స్థాయిలో లాభపడటమే ఇందుకు కారణం. కంపెనీ షేరు ధర 4 శాతం లాభపడి 215.04 డాలర్లకు చేరుకోవడంతో కంపెనీ మార్కెట్ విలువ 3.29 ట్రిలియన్ డాలర్లకు చేరుకున్నది. ఇదే సమయంలో మైక్రోసాఫ్ట్ షేరు విలువ పడిపోవడంతో కంపెనీ మార్కెట్ క్యాప్ 3.24 ట్రిలియన్ డాలర్లకు పరిమితమైంది.

## ఇంజెస్‌తో రెడ్డీస్ జట్టు

న్యూఢిల్లీ, జూన్ 12: ప్రముఖ ఫార్మా సంస్థ డాక్టర్ రెడ్డీస్..అమెరికాకు చెందిన ఇంజెస్ ఫార్మాస్యూటికల్స్‌తో జట్టుకట్టింది. క్యాన్సర్ వ్యాధి చికిత్సకోసం వాడే సైక్లోఫాస్ఫమైడ్ ఇంజెక్షన్‌ను అక్కడి మార్కెట్లో విక్రయించడానికి సంస్థతో అధికారిక ఒప్పందాన్ని కుదుర్చుకున్నది. 500 ఎంజీ/2.5 ఎంఎల్, 1గ్రాము/5 ఎంఎల్, 2గ్రాము/10 ఎంఎల్ రకాల్లో అమెరికా మార్కెట్లో ఈ ఔషధం లభించనున్నది. మార్చితో ముగిసిన ఏడాది కాలంలో ఈ ఔషధ విక్రయాలు 51.8 మిలియన్ డాలర్ల స్థాయిలో ఉన్నాయి.

# ఆగిన పారిశ్రామిక పరుగు

3 నెలల కనిష్ఠానికి పారిశ్రామికోత్పత్తి • ఏప్రిల్‌లో 5 శాతానికి ఐఐపీ పరిమితం

న్యూఢిల్లీ, జూన్ 12: దేశీయ పారిశ్రామికోత్పత్తి వృద్ధిరేటు పడిపోయింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో 3 నెలల కనిష్ఠాన్ని తాకుతూ 5 శాతానికే పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ) పరిమితమైంది. ఈ మేరకు బుధవారం విడుదలైన అధికారిక గణాంకాల్లో తేలింది. దీన్నిబట్టి గనులు, విద్యుత్తు రంగాల ప్రదర్శన బాగున్నా.. కీలకమైన తయారీ రంగం తీరు పేలవంగా ఉండటమే ఐఐపీ క్షీణతకు కారణంగా నిలుస్తున్నది. ఈ ఏడాది మార్చిలో 5.4 శాతంగా, ఫిబ్రవరిలో 5.6 శాతంగా ఉన్న ఐఐపీ.. జనవరిలో 4.2 శాతంగానే ఉన్నది. మళ్లీ ఇప్పుడు అదే స్థాయి దరిదాపుల్లోకి ఏప్రిల్ గణాంకాలు నమోదయ్యాయి. కాగా, గత ఆర్థిక సంవత్సరం (2023-24) ఐఐపీ వృద్ధిరేటు 5.9 శాతంగా ఉన్నది. అంతకుముందు ఆర్థిక సంవత్సరం (2022-23) ఇది 5.2 శాతం. ఇకపోతే గత ఏడాది ఏప్రిల్‌లో ఐఐపీ 4.6 శాతంగా నమోదైందని కేంద్ర గణాంకాలు, కార్యక్రమ అమలు మంత్రిత్వ శాఖ తెలిపింది. దీంతో ఈసారి ఏప్రిల్‌లో పెరిగినట్టే కనిపిస్తున్నది. కానీ గత మూడు నెలలుగా క్రమేణా గణాంకాలు తగ్గుముఖం పడుతుండటం మాత్రం ఒకింత ఆందోళననే కలిగిస్తున్నది.

**రంగాలవారీగా..**

తాజా గణాంకాల ప్రకారం.. నిరుడు ఏప్రిల్‌తో పోల్చితే ఈ ఏప్రిల్‌లో గనుల రంగంలో ఉత్పాదకత వృద్ధి 6.7 శాతానికి పెరిగింది. నాడు 5.1 శాతమే. అలాగే విద్యుదుత్పత్తి కూడా 1.1 శాతం నుంచి 10.2 శాతానికి ఎగిసింది. అయితే తయారీ రంగంలో వృద్ధిరేటు ఏప్రిల్‌లో 3.9 శాతానికి క్షీణించింది. పోయినసారి ఏప్రిల్‌లో 5.5 శాతంగా ఉండటం గమనార్హం. ఈ నేపథ్యంలోనే ఐఐపీ ఓవరాల్ గ్రోత్ దెబ్బతిన్నది. దీనికితోడు క్యాపిటల్ గూడ్స్ విభాగం వృద్ధి సైతం 3.1 శాతానికి పతనమైంది. ఏడాది క్రిందట 4.4 శాతంగా ఉన్నదిది. కన్జ్యూమర్ నాన్-డ్యూరబుల్ గూడ్స్ ఉత్పత్తి కూడా మైనస్ 2.4 శాతంలోకి దిగజారింది. నిరుడు ఏప్రిల్‌లో 11.4 శాతం వృద్ధి కనిపించింది. అందుకే కన్జ్యూమర్ డ్యూరబుల్స్ ఉత్పత్తి 9.8 శాతానికి పుంజుకున్నా ఫలితం లేకపోయింది. నిజానికిది పోయినసారి మైనస్ 2.3 శాతంలో ఉన్నది. మౌలిక, నిర్మాణ రంగాల్లో వృద్ధిరేటూ 8 శాతంగానే ఉన్నది. నిరుడు ఏప్రిల్‌లో 13.4 శాతం. ఇక ప్రైమరీ గూడ్స్ ఉత్పాదక రేటు 1.9 శాతం నుంచి 7 శాతానికి, ఇంటర్మీడియెట్ గూడ్స్ గ్రోత్ 1.7 శాతం నుంచి 3.2 శాతానికి పెరిగినా ఐఐపీని గతంతో పోల్చితే పెంచలేకపోయాయి.



### స్వల్పంగా తగ్గిన రిటైల్ ద్రవ్యోల్బణం

రిటైల్ ద్రవ్యోల్బణం గత నెల స్వల్పంగా తగ్గింది. మే నెలలో 4.75 శాతంగా నమోదైంది. బుధవారం విడుదలైన ప్రభుత్వ గణాంకాల ప్రకారం ఈ వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం ఏప్రిల్‌లో 4.83 శాతంగా ఉన్నది. అయితే నిరుడు మే నెలలో 4.31 శాతంగానే ఉన్నది. దీన్నిబట్టి ఈసారి అర శాతంపైనే పెరిగినట్టైంది. కాగా, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) గరిష్ఠ ద్రవ్యోల్బణం స్థాయి 6 శాతం. కానీ ఆమోదయోగ్య స్థాయి 4 శాతమే. దీంతో ప్రస్తుత గణాంకాలు ఇంకా తగ్గాల్సి ఉన్నది. అప్పుడే వడ్డీరేట్లను తగ్గిస్తామని గత వారం జరిగిన ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షలో ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ స్పష్టం చేసినది తెలిసిందే. నిరుడు ఏప్రిల్ నుంచి కీలక వడ్డీరేట్లు యథాతథంగానే కొనసాగుతున్నాయి. చివరిసారిగా గత ఏడాది ఫిబ్రవరిలో వడ్డీరేట్లను ఆర్బీఐ పెంచింది. ఇక అప్పట్నుంచి రెపోరేటు 6.5 శాతం వద్దే ఉన్నది. ఫలితంగా గృహ, వాహన, వ్యక్తిగత తదితర రుణాల భారం రుణగ్రహీతలపై పడుతూనే ఉన్నది. ఇదిలావుంటే మే నెలలో ఆహార ద్రవ్యోల్బణం 8.69 శాతంగా ఉన్నది. ఏప్రిల్‌లో ఇది 8.70 శాతంగా ఉన్నట్టు జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) తెలిపింది.



## డిపాజిట్లపై తగ్గనున్న వడ్డీరేట్లు!

న్యూఢిల్లీ, జూన్ 12: డిపాజిట్లపై వడ్డీరేట్లు పతాకస్థాయికి చేరుకున్నాయని, స్వల్పకాలంలో ఈ రేట్లు తగ్గే అవకాశం ఉన్నదని ఎస్బీఐ చైర్మన్ దినేశ్ కుమార్ ఖారా తెలిపారు. అలాగే రిజర్వు బ్యాంక్ కూడా వడ్డీరేట్లను కూడా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికం నుంచి తగ్గించే అవకాశాలున్నాయని ఆయన పేర్కొన్నారు. గత వారంలో తన పరపతి సమీక్షలో ఆర్బీఐ వడ్డీరేట్లను యథాతథంగా ఉంచుతూ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఈ ఏడాది మూడో త్రైమాసికం నుంచి రిటైల్ ధరల సూచీ నాలుగు శాతం దిగువకు తగ్గే అవకాశం ఉండటంతో ఆర్బీఐ వడ్డీరేట్లను తగ్గించేందుకు ఆస్కారం ఉంటుందని ఆయన చెప్పారు. ఇప్పటికే పలు దేశాల సెంట్రల్ బ్యాంకులు వడ్డీరేట్లను తగ్గించాయని, వీటిలో స్విట్జర్లాండ్, స్వీడన్, కెనడా, యూరో దేశాలు తగ్గించిన విషయం తెలిసిందే. మరోవైపు, గత నెలలో ఎస్బీఐ ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీరేట్లను 75 బేసిస్ పాయింట్ల వరకు పెంచిన విషయం తెలిసిందే.

## రికార్డుస్థాయికి నిఫ్టీ

స్వల్పంగా పెరిగిన సెన్సెక్స్



ముంబై, జూన్ 12: దేశీయ స్టాక్ మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలతో భారీగా పుంజుకున్న సూచీలకు చివర్లో మదుపరులు అమ్మకాలకు మొగ్గుచూపడంతో భారీ లాభాలను నిలుపుకోలేకపోయింది. బ్లూచిప్ షేర్లైన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు లాభపడటం మదుపరుల్లో సెంటిమెంట్‌ను మెరుగుపరిచింది. వడ్డీరేట్లపై అమెరికా ఫెడరల్ నిర్ణయాన్ని ప్రకటించనున్నప్పటికీ పెట్టుబడిదారులను కొనుగోళ్ల వైపు నడిపించాయి. ఇంట్రాడేలో 600 పాయింట్ల వరకు లాభపడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివర్లో 149.98 పాయింట్లు అందుకొని 76,606.57 వద్ద నిలిచింది. మరో సూచీ నిఫ్టీ రికార్డు స్థాయికి ఎగబాకింది. ఇంట్రాడేలో 177.1 పాయింట్లు అందుకొని చారిత్రక గరిష్ఠ స్థాయి 23,441.95 పాయింట్లను తాకిన సూచీ చివరికి 58.10 పాయింట్లు పెరిగి 23,322.95 వద్ద స్థిరపడింది. సూచీలకు ఇది కూడా గరిష్ఠ స్థాయి కావడం విశేషం.

**429 లక్షల కోట్లకు మదుపరుల సంపద**

మార్కెట్లు భారీగా పుంజుకోవడంలో మదుపరుల సంపద కూడా అంతే స్పీడ్‌తో పెరుగుతున్నది. బుధవారం స్టాక్ మార్కెట్ ముగిసే సమయానికి బీఎస్ఈలో లిస్టైన సంస్థల విలువ రూ.4,29,32,991.65 కోట్లు(5.14 ట్రిలియన్ డాలర్లు) చేరుకున్నది. ఇది కూడా చారిత్రక గరిష్ఠ స్థాయి.

# హైదరాబాద్‌లో ఒలంపస్ పరిశోధన కేంద్రం

హైదరాబాద్, జూన్ 12 (నమస్తే తెలంగాణ): మెడికల్ టెక్నాలజీ రంగంలో ప్రఖ్యాతిగాంచిన ఒలంపస్ కార్పొరేషన్..హైదరాబాద్‌లో పరిశోధన-అభివృద్ధి(ఆర్అండ్‌డీ) ఆఫ్‌షోర్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చింది. ఆధునిక వైద్య పరికరాల అభివృద్ధి ఈ సెంటర్ దోహదం చేయనున్నదని, ముఖ్యంగా ప్రపంచవ్యాప్తంగా విస్తరించే క్రమంలో హెచ్‌సీఎల్ టెక్నాలజీతో కలిసి ఈ సెంటర్‌ను నెలకొల్పబోతున్నది. రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించాలనే ఉద్దేశంతో అమెరికాలో పర్యటిస్తున్న రాష్ట్ర మంత్రులు శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డిలతో ఒలంపస్ కార్పొరేషన్ గ్లోబల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సయ్యద్ నవీన్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఆర్అండ్‌డీ సెంటర్‌ను ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించింది. అనంతరం మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ..మెడికల్ విభాగంలో ప్రపంచంలో అగ్రగామి సంస్థల్లో ఒకటైన ఒలంపస్ కార్పొరేషన్ తమ నాలుగో ఆర్అండ్‌డీ సెంటర్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయడానికి ముందుకురావడం శుభసూచికమని, మెడికల్ టెక్నాలజీ రంగంలో ఇదొక మైలురాయి వంటిదని పేర్కొన్నారు. ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు, వ్యూహాత్మక ప్రాంతంగా ఉండడమే కాకుండా హెల్త్‌కేర్ రంగంలో అనేక అగ్రగామి సంస్థలు, ప్రతిభావంతులైన నిపుణులు కలిగివుండటం మెడ్‌టెక్ రంగంలో ఇది ఖచ్చితంగా గేమ్ చేంజర్ అవుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. సంస్థకు ఇప్పటికే జపాన్, అమెరికా, యూరప్‌లలో పరిశోధన కేంద్రాలున్నాయి.

### ఇక్సిగో ఐపీవో భేష్

న్యూఢిల్లీ, జూన్ 12: ఇక్సిగో ఐపీవోకి పెట్టుబడిదారుల నుంచి విశేష స్పందన లభించింది. సంస్థ జారీ చేసిన షేర్లకు 98 రెట్ల అధిక బిడ్డింగ్‌లు దాఖలయ్యాయి. రూ.740 కోట్ల నిధుల సేకరణకు సంబంధించి 4,37,69,494 షేర్లకుగాను 4,29,36,34,618 షేర్ల బిడ్డింగ్‌లు వచ్చాయి. అలాగే క్వాలిఫైడ్ ఇనిస్టిట్యూషనల్ బయ్యర్ల 106 రెట్లు సబ్‌స్క్రైబ్ కాగా, రిటైల్ పెట్టుబడిదారులు 54 రెట్లు అధికంగా సబ్‌స్క్రైబ్ అయింది.